సాక్షి ఖమ్మం

శుక్రవారం : 12 : జూలై : 2024



శరవేగంగా మూడో లైన్

కాజీపేట – విజయవాడ మార్గంలో చేపట్టిన రైల్వే మూడో లైన్ పనులు జిల్లా కేంద్రంలో చకచకా కొనసాగుతున్నాయి. 8లో



జల్లేపల్లిలో వైద్యాధికారులు..

డెంగీ కేసులు పెరుగుతుండడంతో తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో వైద్యాధికారులు పర్యటించారు. 8లో

గరిష్టం / కనిష్టం

31° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాలకు ఏడుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఏడుగురు అసోసియేట్ ప్రొఫెసర్లను డీఎంఈ కేటాయించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించగా వీరిలో ఏడుగురు ఖమ్మం వచ్చారు. సూర్యాపేట కళాశాల నుంచి జనరల్ మెడిసిన్ వైద్యులు టి.రాజీవ్‌కుమార్, జనరల్ సర్జన్ ఏ.విజయ్‌కుమార్, ఆర్థోపెడిక్ వైద్యులు బీ.ఎం.చంద్రశేఖర్, అనస్తీసియా వైద్యులు టి.నాగేందర్, ఖమ్మంలో పనిచేస్తున్న పీడియాట్రిక్స్ వైద్యులు బి.బాబురత్నాకర్, సిద్దిపేటలో పనిచేస్తున్న డాక్టర్ ఎస్.సభిత రాణి, సికింద్రాబాద్‌లో పనిచేస్తున్న ఫార్మకాలజీ వైద్యులు ఎస్.సుగుణను ఖమ్మం మెడికల్ కాలేజీకి కేటాయించగా రిపోర్ట్ చేశారు. తొలి ఏడాది వచ్చిన ఐదుగురు అసోసియేట్లు విధులు నిర్వర్తిస్తుండగా, ఇప్పుడు కేటాయించిన వారితో ఈ సంఖ్య 12కు చేరింది. మెడికల్ కాలేజీలో రెండో ఏడాది తరగతుల నిర్వహణకు ఎన్‌ఎంసీ నుండి అనుమతులు వచ్చిన నేపథ్యాన బోధన, బోధనేతర సిబ్బందిని విడతల వారీగా కేటాయిస్తున్నారు.

ఉచిత వైద్యసేవలు కొనసాగించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం మామిళ్లగూడెం: వయోవృద్ధులకు ఉచిత వైద్యసేవలను కొనసాగించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ పాలకవర్గ సమావేశం చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అధ్యక్షతన ఖమ్మం వీడీవోస్ కాలనీలోని కార్యాలయంలో జరిగింది. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత వైద్య సేవల విషయంలో జిల్లాను ముందు నిలపాలని తెలిపారు. చైర్మన్ చంద్రమోహన్ మాట్లాడుతూ సంస్థ సభ్యులు వయోవృద్ధులు ఉచిత వైద్యసేవలందించడంలో కీలకంగా పనిచేస్తున్నారని చెప్పారు. నగరంతో పాటు గ్రామాల్లో తరచుగా వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి సాదినేని జనార్దన్‌రావుతో పాటు సత్యనారాయణరెడ్డి, గుదిమళ్ల సూర్యప్రకాశరావు, శ్రీహరి, నాగేశ్వరావు, నరసయ్య, ఉప్పలయ్య, షేక్ ముజీబ్, హరినాధబాబు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నేషనల్ ట్రైబల్ కమిషన్ సభ్యుడి పర్యటన

ఖమ్మంమామిళ్లగూడెం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం ఖమ్మం చేరుకోనున్న ఆయన 11 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లను పరిశీలించి 3గంటలకు ఖమ్మం పోలీస్ కమిషనర్‌తో సమావేశం కానున్నారు. ఆతర్వాత సాయంత్రం బోనకల్ మండలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్‌ను తనిఖీ చేశాక భద్రాచలం వెళ్తారని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

హాజరుశాతం పెరగాలి..

చింతకాని: విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా అధ్యాపకులు దృష్టి సారిస్తూనే మెరుగైన బోధన అందించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రవిబాబు సూచించారు. చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురుఆరం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రికార్డులు, విద్యార్థుల ప్రవేశాలు, హాజరు శాతాన్ని పరిశీలించి గత ఏడాది ఉత్తీర్ణతపై సమీక్షించారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ అధ్యాపకులు ఇప్పటి నుంచే బోధనపై ప్రత్యేక దృష్టి సారిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ నవీన్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డ్‌లో 155 మంది ఇన్‌వాలిడేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన మెడికల్ బోర్డ్‌లో 155 మంది ఇన్‌వాలిడేషన్ అయ్యారు. సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి 204 మంది కార్మికులను ఎంపిక చేసి బోర్డ్‌కు పిలవగా, వారిలో 30 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 174 మంది హాజరుకాగా 155 మందిని ఇన్‌వాలిడేషన్‌గా గుర్తించారు. 19 మందిని హయ్యర్ రిఫరల్‌కు, ఫిట్ ఫర్ సేమ్ జాబ్‌కు పంపినట్లు సమాచారం.

భరోసా దక్కితే అదే పదివేలు..

- అష్టకష్టాలు పడుతున్న కౌలు రైతులు
- వైఎస్సార్ హయాంలో గుర్తింపు కార్డుల పంపిణీ
- ఆ తర్వాత దృష్టి సారించని ప్రభుత్వాలు
- రైతు భరోసాలో చేర్చాలని పెరుగుతున్న డిమాండ్
- వారి నుంచీ అభిప్రాయాలు సేకరించిన మంత్రివర్గ ఉపసంఘం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: సెంట్ భూమి ఉండదు.. వ్యవసాయం తప్ప ఇతర పని చేయలేరు.. దీంతో కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న వారికి ఏ పథకమూ అందక అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పుడు వీరిని ఆదుకోవడం దిశగా రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ కౌలు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన నేపథ్యాన వీరికి ఏ రూపంలో సాయం అందించాలనే అంశంపై అభిప్రాయ సేకరణ చేపట్టింది. తాజాగా రైతుభరోసా అమలుపై అధ్యయనం చేస్తున్న మంత్రివర్గ ఉపసంఘం కౌలు రైతులు ఏం కోరుకుంటున్నారో ఆరా తీస్తోంది. ఖమ్మం కలెక్టరేట్‌లో తాజాగా జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో కౌలు రైతులకు ప్రయోజనం కలిగేలా నిర్ణయం తీసుకోవాలని ముక్తకంఠంతో కోరగా... వారికి రైతు భరోసా అందిస్తారా.. గుర్తింపు కార్డులు జారీచేసి మరో రూపంలో సాయం చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

‘గుర్తింపు’ ఇచ్చిన వైఎస్

కౌలు రైతులకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అండగా నిలిచారు. 2008–09లో కౌలు రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో గుర్తింపునకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు లక్ష మంది కౌలు రైతులు ఉన్నట్లు తేలగా గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అంతేకాక కౌలుదారు చట్టాన్ని తీసుకొచ్చి ఆర్‌ఓఆర్(రైట్‌ఆఫ్ రికార్డ్స్) ప్రకారం పంట రుణాలు సైతం అందజేశారు. కౌలు రైతులు పండించే ధాన్యమే ష్యూరిటీగా ఈ రుణాలిచ్చారు. అలాగే వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఇచ్చే నక్ల ఆధారంగా వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు సైతం పంపిణీ చేశారు.

చిగురిస్తున్న ఆశలు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15వేల చొప్పున రైతుభరోసా అందించాలని నిర్ణయించి విధివిధానాలు ఖరారుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఇందుకోసం అభిప్రాయాలు సేకరిస్తుండగా భేటీలకు కౌలు రైతులను సైతం ఆహ్వానిస్తోంది. దీంతో తమకు వైఎస్ హయాంలో పంట రుణాలు, సబ్సిడీలు అందాయని వెల్లడించిన కౌలురైతులు తమను ఆదుకోవాలని కోరారు. అలాగే రైతుసంఘాల నాయకులు సైతం కౌలు రైతులకు రైతుభరోసా అందించాలని.. లేకపోతే సబ్సిడీలు, పంట రుణాలైనా ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో సానుకూలంగా ఉండడంతో వారిలో ఆనందం వ్యక్తం అవుతోంది. ఇవన్నీ పరిశీలిస్తే అసెంబ్లీలో చర్చల సందర్భంగా తమకు లబ్ధి జరిగేలా ప్రతిపాదనలు చేస్తారని కౌలు రైతులు భావిస్తున్నారు.

సబ్సిడీలకు మంగళం

తెలంగాణ ఏర్పడ్డాక ‘ధరణి’ వెబ్‌సైట్ తెరపైకి వచ్చింది. దీంతో కౌలుదారులకు సాయం అందించే అవకాశం లేకుండా పోయింది. అంతకుముందు వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఫలానా రైతు పొలం.. సదరు వ్యక్తికి కౌలుకు ఇచ్చారని నకలు రాసిస్తే యంత్ర పరికరాలు, విత్తనాలకు సబ్సిడీ లభించేది. 2008–09 లో యంత్ర పరికరాలపై 50 శాతం సబ్సిడీ ఇచ్చేవారు. 2016–17 వరకు కౌలు రైతులకు కొనసాగిన సబ్సిడీలు ఆ తర్వాత అందలేదు. 2020 తర్వాత సాధారణ రైతులకు సైతం విత్తన సబ్సిడీలు పూర్తిస్థాయిలో ఎత్తేశారు. పచ్చిరొట్ట విత్తనాలకు మినహా మిగిలిన వాటికి సబ్సిడీ ఇవ్వడం లేదు. వరి కిలో విత్తనాలకు 2020 ముందు వరకు రూ.5 నుంచి రూ.10 వరకు, అపరాలకు 40 నుంచి 50 శాతం సబ్సిడీ రాయితీ వర్తించేది.

ఎన్నికల హామీల్లో స్థానం

జిల్లాల విభజన తర్వాత ఖమ్మం జిల్లాలో 3.45 లక్షల మంది రైతులు ఉన్నట్లు తేలింది. ఇందులో 25 శాతం మంది అంటే 87,500 మంది వరకు కౌలు రైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదు. ఏళ్లుగా భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేయడమే తప్ప ఎలాంటి హక్కులు, రాయితీలు దక్కడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైతం పరిహారం అందకపోగా.. రైతుబంధు వంటి ప్రయోజనాలూ దరి చేరడం లేదు. గత ఏడాది చివరిలో జరిగిన ఎన్నికల్లో కౌలు రైతులను కూడాఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ వెల్లడించడం.. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ఇకనైనా తమకు ప్రయోజనం దక్కుతుందని కౌలుదారులు ఆశిస్తున్నారు.

మాకు భరోసా ఇవ్వాలి..



నేను 35 ఏళ్లుగా కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నా. ఇప్పుడు లాభాలు లేక పదెకరాల నుంచి ఐదెకరాలకు తగ్గించా. మాకు రైతుబంధుతో పాటు ఏమీ అందక నష్టపోతున్నాం. గుర్తింపు కార్డులు జారీచేసి రైతుభరోసా, సబ్సిడీ అమలు చేయాలి.

– కాలంగి సైదులు, కౌలు రైతు, మత్కేపల్లి

గుర్తింపు కార్డులు అందజేయాలి..



మాకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణసదుపాయం కలిగించాలి. 15 ఏళ్లుగా కౌలునే నమ్ముకోగా.. పంట పండినా, లేకున్నా కౌలు చెల్లించాల్సి వస్తోంది. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు సంఘాలుగా ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించారు. ఇప్పుడు కూడా రుణాలు ఇవ్వాలి.

– కొమ్మినేని నరసింహారావు, కౌలు రైతు, కొణిజర్ల

పెట్టుబడి సాయంతో ఊరట



ఎన్నికల హామీ మేరకు కౌలుదారులకు పెట్టుబడి సాయం అందించాలి. అన్ని పంటలకు బోనస్ ప్రకటిస్తే మేలు జరుగుతుంది. రైతుభరోసా కూడా వ్యవసాయేతర భూములకు కాకుండా చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేలా అమలుచేయాలి.

– ఆవుల వెంకటేశ్వర్లు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కొత్తగా రెండు మార్కెట్లు



- చింతకాని, ముదిగొండలో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- పదెకరాల చొప్పున స్థల లభ్యతపై ఆరా
- త్వరలోనే జిల్లా స్థాయిలో సిద్ధం కానున్న నివేదికలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో మరో రెండు వ్యవసాయ మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం ఎనిమిది మార్కెట్లు ఉండగా.. రైతులకు సౌలభ్యం కోసం కొత్తగా రెండు మార్కెట్లు ఏర్పాటుచేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, మధిర, వైరా, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లు కొనసాగుతున్నాయి. తొలినాళ్లలో ఏడు మార్కెట్లే ఉండగా ఖమ్మం మార్కెట్‌కు పెరుగుతున్న రదీ దృష్ట్యా ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో నాలుగేళ్ల క్రితం మార్కెట్ ఏర్పాటు చేశారు. అయితే, జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుండడం, నీటి వనరుల లభ్యత ఆధారంగా నానాటికీ మార్కెట్లపై భారం పడుతోంది.

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో నీటి వనరులు పెరిగిన క్రమాన వానాకాలం, యాసంగి పంటల సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తి పెరుగుతోంది. దీంతో పంట ఉత్పత్తులను తీసుకొచ్చే వారి సంఖ్యకు అనుగుణంగా కొత్త మార్కెట్ల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పేరు ఉండగా... ఇక్కడ ఏటా రూ.వేల కోట్ల విలువైన మిర్చి, పత్తి పంటల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దీంతో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు రూ.100 కోట్లకు పైగా నిధులను ఇటీవల కేటాయించారు. ఇదే సమయాన రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త మార్కెట్ల ఏర్పాటుపైనా దృష్టి సారించారు.

అక్కడైతే బాగు...

జిల్లాలో మరో రెండు వ్యవసాయ మార్కెట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు చింతకాని, ముదిగొండను ఎంపిక చేశారు. ఖమ్మం మార్కెట్ పరిధి నుంచి కొంత భాగాన్ని విడదీసి చింతకానిలో, నేలకొండపల్లి మార్కెట్ నుంచి విడదీసి ముదిగొండలో వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆయా మండలాల్లో మూడేళ్లగా పంటల సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తులు, రైతుల సంఖ్య తదితర అంశాలతో మార్కెటింగ్ శాఖ నివేదికలు సిద్ధం చేసింది.ఒక్కో మార్కెట్‌కు పది ఎకరాల స్థలం అవసరమని ప్రతిపాదనల్లో పొందుపర్చగా.. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించే బాధ్యత రెవెన్యూ శాఖకు అప్పగించినట్లు తెలిసింది. ఆపై జిల్లా అధికారులు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించనున్నారు.

ప్రధాన పంటలు.. పత్తి, వరి, మిర్చి, అపరాలు

వరి, పత్తి, మిర్చి ప్రధాన పంటలను జిల్లావ్యాప్తంగానే కాక చింతకాని, ముదిగొండ మండలాల్లోనూ అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. చింతకాని మండలంలో పత్తి 24 వేల ఎకరాల్లో, వరి ఆరు వేల ఎకరాల్లో, మిర్చి మూడు వేల ఎకరాల్లో, అపరాలు ఆరు వేల ఎకరాల్లో సాగవుతోంది. ఇక ముదిగొండ మండలంలో పత్తి 14 వేల ఎకరాల్లో, మిర్చి నాలుగు వేల ఎకరాల్లో, వరి 16 వేల ఎకరాల్లో, మొక్కజొన్న, అపరాల పంటలు 15 వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ఈ మండలాల రైతులు పంట ఉత్పత్తులను ఎక్కువగా ఖమ్మం మార్కెట్‌కే తీసుకొస్తుంటారు. ఈ రెండు మండలాల్లో పంటల సాగు వివరాలు, ఉత్పత్తుల ఆధారంగా వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించిన నేపథ్యాన త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

సాంకేతిక లోపంతో ఆగిన సేవలు

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో గురువారం రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. ఉదయమే కార్యాలయాలకు వచ్చిన సబ్ రిజిస్ట్రార్లు సైట్‌లో లాగిన్ అయ్యేందుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. ఆధార్ సర్వర్ సేవలు నిలవడంతో బయోమెట్రిక్ చేయలేకపోయారు. ఆపై డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు వినియోగదారుల ఆధార్ నంబర్ల ప్రకారం వేలిముద్ర తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ బయోమెట్రిక్ వెరిఫికేషన్ జరగక ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. అన్ని కార్యాలయాల్లో కలిపి రోజుకు 250 నుండి 300 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతుండగా.. శాఖకు రూ.కోటి మేర ఆదాయం సమకూరేది. సాంకేతిక లోపం కారణంగా ఆ ఆదాయాన్ని కోల్పోయినట్లయింది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగానే ఈ సేవలు నిలిచిపోయాయని శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న పలువురు సాయంత్రం వరకు కార్యాలయాల్లో పడిగాపులు కాసినా ఫలితం లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

చేప పిల్లల పెంపకంపై కమిషనర్ సమీక్ష

జిల్లాలో 3.45 లక్షల పిల్లల విడుదలకు సమాయత్తం

ఖమ్మంవ్యవసాయం: చేప పిల్లల పెంపకంపై రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అల గురువారం హైదరాబాద్‌లో సమీక్షించారు. రాష్ట్ర మత్స్యశాఖ సహకార ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి మత్స్యశాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొనగా.. మూడు రకాల జలాశయాల్లో చేప పిల్లల పెంపకానికి ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. శాశ్వత నీటి వనరులు, రిజర్వాయర్లు, ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు నీరు నిల్వ ఉండే చెరువుల్లో చేప పిల్లలు పెంచేలా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ సూచించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 896 జలాశయాల్లో 3.45 లక్షల చేప పిల్లలు పెంపకానికి అనుగుణంగా టెండర్లు ఆహ్వానించాలని ప్రతిపాదించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి తెలిపారు.

అభివృద్ధి పనులకు సరిపడా నిధులు

- పాఠశాలల్లో పనులపై దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



జిల్లా గణాంకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసిన బడుల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. అభివృద్ధి పనులకు నిధులు కొరత లేనందున వేగం పెంచాలని తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, మండల సమాఖ్యల బాధ్యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. పంచాయతీరాజ్ విభాగానికి కేటాయించిన 423 పాఠశాలల్లో 248, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన 51 పాఠశాలల్లో 30 చోట్ల, విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 177 పాఠశాలల్లో పనులు చేపట్టగా 104 చోట్ల పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా 260 స్కూళ్లకు గాను 112, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన 44 పాఠశాలలకు గాను 14 చోట్ల పనులు పూర్తికాగా మిగతా చోట్ల త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా...

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే మహిళా శక్తి పథకం ఉద్దేశమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, మహిళా సంఘాల బాధ్యులతో పథకం అమలుపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ సహాయక సంఘాల్లోని సభ్యులను సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాల్లో ప్రోత్సహించాలని చెప్పారు. బ్యూటీపార్లర్ల ఏర్పాటు, నాటుకోళ్ల పెంపకం, పాడి గేదెలు, టెంట్ హౌజ్ నిర్వహణ యూనిట్లపై చర్చించారు. ఆతర్వాత చీఫ్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యానరూపొందించిన జిల్లా గణాంకాల హ్యాండ్‌బుక్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. ఈసమావేశాల్లో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, డీఈఓ సోమశేఖరశర్మ, సీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీ నిర్మాణ ప్రతిపాదిత స్థలంలో పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

అవసరాలకు అనుగుణంగా భవనాలు

ఖమ్మంఅర్బన్: భవిష్యత్ అవసరాలకు సరిపడేలా మెడికల్ కాలేజీ నూతన సముదాయం నిర్మాణం ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులకు సూచించారు. ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి, రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలకు కేటాయించిన 40 ఎకరాల స్థలాన్ని ఆయన పరిశీలించారు. తొలుత ప్రహరీ నిర్మించి, ఆపై భవన నిర్మాణాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఆర్డీఓ గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు, తహసీల్దార్లు సీహెచ్.స్వామి, విల్సన్ ల్గొన్నారు.

గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల బాధ్యతల స్వీకరణ

హాజరైన మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డితో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత కార్యాలయంలో పూజలు చేశాక రాయల బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా అర్హులకు ఫలాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల సహకారంతో దక్కిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ శాఖ అభివృద్ధికి కృషిచేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య, సాధు రమేష్‌రెడ్డి, దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



రాయలను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

పాలేరు జలాశయం వెలవెల



ఏడు అడుగులకు పడిపోయిన నీటిమట్టం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీరు లేక వెలవెలబోతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా.. గురువారం ఏడు అడుగులకు పడిపోయింది. ఇది మరో రెండు అడుగులు తగ్గితే డెడ్‌స్టోరేజీకి చేరుతుంది. కృష్ణా పరీవాహక ప్రాంతంతో పాటు జిల్లాలోనూ సరైన వర్షాలు లేక నీరు చేరే మార్గం కానరావడం లేదు. ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి తాగునీటి పథకాలకు రోజూ 135.45 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఖమ్మం నగరానికి సైతం ఇక్కడి నుండే నీరు విడుదల చేస్తుండడంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ఇంకొన్ని రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరి తాగునీటి పథకాలకూ ఇక్కట్లు ఎదురవుతాయి. మరోపక్క పాలేరు పాత కాల్వ, సాగర్ ప్రధాన కాల్వల కింద రైతులు వరి నార్లు పోసుకుని సాగర్ జలాల విడుదలకు ఎదురుచూస్తున్నారు.

ఏ సమస్య ఎదురుకావొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: వసతిగృహాల్లో ఎలాంటి సమస్య ఎదురుకాకుండా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర ఏ, బీసీ బాలుర వసతిగృహాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, సరుకులను పరిశీలించిన ఆయన విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా, లేదా అని ఆరా తీశారు. అలాగే, సరుకుల నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య కార్యక్రమాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

కూసుమంచి: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. కూసుమంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.



ఖమ్మం బీసీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

క్లుప్తంగా

కేఎంసీ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ అధికారిగా పాండురంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆడిట్ విభాగంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ అధికారిగా పాండురంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని టీఎస్ ఎండీసీ(మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఖమ్మం వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ ఆడిట్ డీడీ హుస్సేన్ నుంచి పాండురంగారావుకు బాధ్యతలు స్వీకరించారు.

ఆర్టీసీ ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా మన్‌మోహన్‌సింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ వైద్యాధికారిగా వరంగల్ రీజినల్ వైద్యాధికారి మన్‌మోహన్‌సింగ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం వైద్యాధికారి గిరిసింహారావు మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో మన్‌మోహన్‌సింగ్‌ను ఇన్‌చార్జిగా కేటాయించారు. కాగా, ఆర్టీసీ వైద్యాధికారి పోస్టును కాంట్రాక్ట్ విధానంలో నియమించడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇప్పటికే వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేశారు.

మా సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించండి



ఎమ్మెల్యే రాందాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వైరా: వీఆర్‌ఓలను మాతృ సంస్థలోనే కొనసాగించేలా అసెంబ్లీలో ప్రస్తావించాలని వీఆర్‌ఓల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేందర్‌రావు కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఆధ్వర్యాన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపేందర్‌రావు మాట్లాడుతూ తమ సమస్యలపై ఇప్పటికే కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వగా, అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5వేలమంది వీఆర్‌ఓలతో మహాసభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో షేక్ సైదులు, బాషా సాహెబ్, అశోక్, నరసింహారావు, లాల్‌మియా, నాగేశ్వరరావు, బాలమురళి, వెంకటేశ్వర్లు, అనిత, శ్రీలక్ష్మి, పద్మ, రవికుమార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కూసుమంచి: మండలంలోని పాలేరు మత్స్య పరిశోధన స్థానంలో 'రీ సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్' అంశంపై మత్స్యకారులకు ఇస్తున్న గురువారం ముగిసింది. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల మత్స్యకారులు శిక్షణలో పాల్గొనగా ముగింపు సమావేశంలోపాలేరు పరిశోధన కేంద్రం పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. మత్స్యకారులు వృత్తిలో రాణించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పాలేరు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ ఎదుట గ్రామస్తుల ఆందోళన

నేలకొండపల్లి: ఎక్సైజ్ పోలీసులు ఇంట్లో ఎవరూ లేని సమయాన తనిఖీలు చేపట్టారని ఆరోపిస్తూ గురువారం రాత్రి పలువురు నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు.. మండలంలోని మోటాపురంలో గురువారం ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ బెల్ట్‌షాపులో నిర్వాహకుడు లేని సమయాన తలుపులు తీసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతో గ్రామస్తులు రాత్రి ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలా తనిఖీ చేస్తారని ప్రశ్నించడంతో పోలీసులు మద్యం తిరిగి అప్పగించినట్లు తెలిసింది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ కె.జగన్నాథరావు వివరణ కోసం యత్నించగా ఆయన స్పందించలేదు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,600	6,500
కందులు	10,300	10,300
మిర్చి	17,800	7,000
మిర్చి తాలు	10,000	7,000
ఏసీ మిర్చి	19,300	10,000
ఏసీ తాలు	10,000	9,000
పత్తి	7,350	4,500

– ఖమ్మం వ్యవసాయం

శరవేగంగా రైల్వే మూడోలైన్

- బర్మాషెల్ రోడ్డు నుంచి వెంకటగిరి గేట్ వరకు పనులు
- తొలిదశలో సైడ్ వాల్స్ నిర్మాణం
- మధ్య గేట్ మనుగడ ప్రశ్నార్థకమే



మూడో లైన్ ప్రతిపాదిత ప్రాంతంలో నిర్మిస్తున్న సైడ్‌వాల్స్

ఖమ్మం రాపర్తినగర్: రైల్వే మూడో లైన్ పనులు జిల్లా కేంద్రంలో వేగవంతమయ్యాయి. ఖమ్మంలోని బర్మాషెల్ రోడ్డు నుంచి వెంకటగిరి బ్రిడ్జి వరకు మూడో లైన్ పనులు చకచకా చేపడుతున్నారు. ఇప్పటికే మధ్య గేట్‌ను మూసివేయగా.. రోడ్డుపై మార్కింగ్ చేసి సైడ్ వాల్స్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే కాజీపేట – విజయవాడ మార్గంలో పలుచోట్ల మూడో లైన్ నిర్మాణం పూర్తికాగా జిల్లా పరిధిలో మాత్రం వివిధ కారణాలతో అనుకున్న స్థాయిలో జరగడం లేదు. దీంతో ఇటీవల తనిఖీ చేసిన అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతో ఇటీవల వేగం పెంచారు. ఇందుకోసం కాంట్రాక్టర్ అదనపు సిబ్బందిని సైతం సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. వెంకటగిరి బ్రిడ్జి నుంచి ధంసలాపురం బ్రిడ్జి వరకు పనులు తొలిదశలో పూర్తి చేయాలని అధికారులు సూచించడంతో ప్రత్యేక దృష్టి సారించారు. కాగా, మూడో లైన్ నిర్మాణం పూర్తయితే బర్మాషెల్ రోడ్డు నుంచి శ్రీనివాస్‌నగర్, ప్రకాష్‌నగర్, మార్కెట్ రోడ్డుకు వెళ్లే పరిస్థితి ఉండదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఈ ప్రాంతంలో నిర్మాణానికి అవసరమైన గృహాలు, ఖాళీ స్థలాల యజమానులకు రైల్వే శాఖ ఇప్పటికే పరిహారం చెల్లించినట్లు తెలిసింది.

త్వరలోనే రైల్వేస్టేషన్‌లో...

మూడో లైన్‌ను తొలిదశలో బర్మాషెల్ రోడ్డు నుంచి వెంకటగిరి బ్రిడ్జి వరకు నిర్మిస్తారు. ఆపై రైల్వే స్టేషన్ పరిధిలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సారధినగర్ వైపు పనుల్లో ఎలాంటి అడ్డంకులు ఉండవని తెలుస్తుండగా.. అక్కడా త్వరగా లైన్ పూర్తవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే రామన్నపేట, కామంచికల్ ప్రాంతాల్లో మూడో లైన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

గేట్ మూతపడుతుందా?

మూడో రైల్వేలైన్ ఖమ్మంలో పూర్తయితే మధ్య గేట్ మూతపడుతుందనే ప్రచారం జరుగుతోంది. ఫలితంగా వెంకటగి బ్రిడ్జి లేదా మయూరి సెంటర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కాగా, మూడో లైన్ పూర్తయ్యే వరకు ఈ విషయంలో స్పష్టత ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం త్రీటౌన్ నుంచి వన్ టౌన్‌కు వెళ్లే వారు ఈ గేట్ మీదుగానే రాకపోకలు సాగిస్తారు. ఒకవేళ ఈ గేట్ మూసివేయాల్సి వస్తేఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతులు వస్తున్నాయి.



వెంకటగిరి బ్రిడ్జి మార్గంలో రోడ్డు చదును చేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీలకు అద్దెల్లేవ్..

- జిల్లాలో సెంటర్లకు రూ.1.57 కోట్ల బకాయి
- మార్చి నుండి చెల్లించని ప్రభుత్వం

ఖమ్మంవన్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె కష్టాలు వచ్చిపడ్డాయి. కొత్త ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అద్దె చెల్లింపుపై దృష్టి సారించకపోవడంతో జిల్లావ్యాప్తంగా రూ.1.57కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. దీంతో అద్దె చెల్లించాలని భవన యజమానులు టీచర్లపై ఒత్తిడి తీసుకొస్తుండడంతో వారికి ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురవుతోంది.

450 సెంటర్లు అద్దె భవనాల్లో..

జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అందులో 956 కేంద్రాలకు సొంతభవనాలు ఉన్నాయి. మిగతా వాటిలో 450 కేంద్రాలు అద్దెభవనాల్లో, 434 సెంటర్లు ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాలకు సంబంధించి 196 కేంద్రాలు అర్బన్ ప్రాంతాల్లో ఉండగా రూ.6వేలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటికి నెలనెలా రూ.2వేల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అయితే, నెలనెలా నిధులు విడుదల కాకపోవడంతో టీచర్లు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి వరకు బకాయిలు చెల్లించగా.. ఏప్రిల్ నుంచి జూన్ వరకు చెల్లించాల్సి ఉంది. ఈనేపథ్యాన యజమానులు టీచర్లపై ఒత్తిడి చేస్తుండడంతో కొందరు సొంత డబ్బులు చెల్లిస్తున్నారు. మిగతా వారు నిధుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

ఈ నెలాఖరు లోపు రావొచ్చు...



అద్దె భవనాల్లో కొనసాగుతున్న 450 సెంటర్లకు మూడు నెలల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ నెలాఖరు లోపు ప్రభుత్వం బిల్లులు విడుదల చేసే అవకాశం ఉంది. ఆ వెంటనే చెల్లింపులు చేపడతాం.

– రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి

జల్లేపల్లిలో వైద్యాధికారుల పర్యటన

దోమల వ్యాప్తి, వ్యాధుల నివారణపై అవగాహన

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లిలో డెంగీ జ్వరాల తీవ్రతపై వైద్య, ఆరోగ్య శాఖాధికారులు స్పందించారు. 'సాక్షి'లో గురువారం 'జల్లేపల్లిని వీడని డెంగీ' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. జిల్లా మలేరియా అధికారి లక్ష్మీనారాయణ, ఏఎంఓ వెంకటేశ్వర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే, గ్రామపంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. కాగా, ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకున్న ఆరుగురికి ఇప్పటికే డెంగీ నమోదు కాగా, గురువారం మరో రెండు కేసులు బయటపడ్డాయి. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రామారావు, హెచ్‌ఈఓ నరేష్, రామయ్య, ఏఎన్‌ఎం నాగమణి పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అజ్మీరాతండాలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని డీఎంఓ లక్ష్మీనారాయణ పరిశీలించారు.



జల్లెపల్లిలో వివరాలు ఆరా తీస్తున్న ఏఎంఓ వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి మండలంలో...

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలో ఓ డెంగీ కేసు నమోదైనట్లు తెలిసింది. సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన వృద్ధుడు మండలంలోని ఓ గ్రామంలో బంధువుల ఇంటికి ఇటీవల వచ్చాడు. వారం రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా గురువారం డెంగీగా నిర్ధారించినట్లు తెలిసింది. అదే గ్రామంలో మరో వ్యక్తికి సైతం డెంగీ లక్షణాలు ఉండడంతో ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, ఈ విషయం తమ దృష్టికి రాలేదని మండల వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ మాలతి, పక్కన అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: చిన్న కుటుంబంతో చింతలు ఉండవని గుర్తించి జనాభా నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తల సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ ఏడాది 'సరైన సమయంలో గర్భధారణ, గర్భం మధ్య అంతరం, తల్లీబిడ్డలకు క్షేమదాయకం' అంశంతో జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరైన సమయంలో పిల్లలకు పెళ్లి చేయడమేకాక పిల్లలను ఎప్పుడు కనాలో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. అలాగే, పిల్లల మధ్య అంతరం కనీసం మూడేళ్లు ఉంటే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. అంతేకాక అబ్బాయి లేదా అమ్మాయే కావాలని ఎదురుచూడకుండా ఎవరైనా ఒకటేనని భావన రావాలని చెప్పారు. డీపీహెచ్ ఎన్‌ఓ విమల, డిప్యూటీ డెమో సాంబశివారెడ్డి మాట్లాడగా కార్యాలయ ఏఓ డాక్టర్ మోత్యా, డిప్యూటీ స్టాటికల్ అధికారి వేణుమాధవ్, అసిస్టెంట్ స్టాటికల్ అధికారి ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సర్వే అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న సర్వే అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా బెల్లంపల్లి ఏరియా ఖైరీగుడ ఓసీ సర్వే ఆఫీసర్ పి.రాజశేఖర్‌ను మణుగూరు పీకేఓసీకి, మణుగూరు పీకేఓసీ నుంచి దొంతుల ఓంప్రకాశ్‌ను కొత్తగూడెం ఏరియా ఏఎస్‌ఓ కార్యాలయానికి బదిలీ చేశా రు. అలాగే, మందమర్రి ఏరియా రామకృష్ణా పూర్‌లోని సీనియర్ సర్వే ఆఫీసర్ ఎండీ నజీరుద్దీన్‌ను మందమర్రి ఏరియా కేకే–5 గనికి, మందమర్రి ఏరియా ఆర్‌కే–1 ఇంక్‌లైన్‌లో సర్వే ఆఫీసర్ పండిల ప్రభాకర్‌ను మందమర్రి ఏరియా కాసీపేట గనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ద్విచక్ర వాహనం చోరీ

సత్తుపల్లి టౌన్: సత్తుపల్లిలోని శ్రీనివాస టాకీస్ రోడ్డులో గురువారం ఓ వ్యక్తి ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. సదరు వ్యక్తి బైక్‌ను మారు తాళంతో స్టార్ట్ చేసుకుని ఉడాయించాడు. ఈ దృశ్యాలు సీసీ టీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. కాగా, సత్తుపల్లిలో ఇటీవల బైక్ చోరీలు పెరుగుతున్నందున పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కంటైనర్

సత్తుపల్లి టౌన్: కారును తప్పించే క్రమంలో కంటైనర్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన గురువారం రాత్రి సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని రామాలయం సమీపాన కారును తప్పించేందుకు యత్నించిన కంటైనర్ డ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టగా ధ్వంసమైంది.నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈఓ శర్మ, ఉపాధ్యాయులు

డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని, తద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఈ. సోమశేఖరశర్మ వెల్లడించారు. ఖమ్మంలోని సైన్స్ మ్యూజియంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా నేషనల్ గ్రీన్ కాప్స్, విద్యాశాఖ ఆధ్వర్యాన 8, 9వ తరగతుల విద్యార్థులకు కవితలు, పోస్టర్ల తయారి పోటీలతో పాటు పర్యావరణ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూనే సామాజిక అంశాలపైదృష్టిసారించాలని తెలిపారు. కాగా, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల నుండి 200 మంది విద్యార్థులు, 58 పాఠశాలల ఎన్జీసీ టీచర్లు పాల్గొనగా... కవితలు, పోస్టర్ల తయారీ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి జగీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌టీసీ కోఆర్డినేటర్ ఎనముల వెంకటేశ్వర్లు, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, ఎంఈఓ శ్రీనివాస్, ఊటుకూరు శ్రీనివాస్, మహమ్మద్ షఫీ, వెంకటేశ్వర్లు, గాజుల భారతి ఆదిత్య పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీకి అటానమస్ హోదా

వెల్లడించిన చైర్మన్ కృష్ణ, కరస్పాండెంట్ జి.ధాత్రి



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ కృష్ణ, కరస్పాండెంట్ ధాత్రి తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ యూజీసీ ప్రకటించిందని చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 2033–34 విద్యాసంవత్సరం వరకు పదేళ్లు ఈ హోదా ఉంటుందని తెలిపారు. అటానమస్‌తో పాటు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడంతో విద్యార్థులు దూర ప్రదేశాలకు వెళ్లి వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఇక్కడే అత్యాధునిక ప్రమాణాలతో చదువుకునే వీలు కలుగుతుందన్నారు. ఈ హోదాతో సిలబస్ రూపకల్పన, పరిశోధనలు చేయొచ్చని, ప్రఖ్యాత కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణ, అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీ, నిపుణులైన అధ్యాపకులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయగా, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.అమిత్ బింధాజ్ తదితరులు పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తిరుమలాయపాలెం: మండలంలోని అజ్మీరా తండాలో ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పిండిప్రోలుకు చెందిన అంగడి సురేష్ 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పలువురి వద్ద కొనుగోలు చేసి గ్రామానికి చెందిన బోడ రమ ఇంట్లో నిల్వ చేశాడు. ఈవిషయమై సమాచారం అందడంతో తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఆర్‌ఐ వీరయ్య తనిఖీలు చేయగా.. సివిల్ సప్లయిస్ డీటీ విజయ్‌బాబు చేరుకుని బియ్యాన్ని సీజ్ చేశారు. ఈమేరకు ఇంటి యజమానితో పాటు సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

ముదిగొండ: ఇటీవల రహదారిపై ఓ విద్యార్థిని బెదిరించి స్పోర్ట్స్ బైక్, ఫోన్ లాక్కెళ్లిన ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు... కమలాపురానికి చెందిన విద్యార్థి ఎల్లాల రామాంజనేయులు ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి ఖమ్మం నుంచి స్వగ్రామం వెళ్తుండగా వనంవారి కిష్టాపురంలోని ఫంక్షన్ హాల్ వద్ద స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అడ్డగించారు. ఆయనను బెదిరించి రూ. 2.20లక్షల విలువైన స్పోర్ట్స్ బైక్, రూ.30వేలు విలువైన ఫోన్ లాక్కన్నారు. అయితే, బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు.. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంకు చెందిన పోతురాజు నవీన్, ఎం.వెంకటాయపాలెంకు చెందిన మందాటి అజయ్, బొబ్బిళ్ల లోకేష్‌ను నిందితులుగా గుర్తించారు. వీరు బైక్, సెల్ ఫోన్‌ను కోదాడలో విక్రయించడానికి వెళ్తుండగా న్యూలక్ష్మీపురం సమీపాన అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా, నిందితులను 48గంటల్లోగా అరెస్ట్ చేసిన ఎస్‌ఐ నరేష్‌ను అధికారులు అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



అంకె రమేష్ (ఫైల్)

మధిర: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని మడుపల్లికి చెందిన అంకె రమేష్(38) కొన్నేళ్ల క్రితం కారు కొనుగోలు చేసి అద్దెకు తిప్పుతూ మధిరలో నివాసముంటున్నాడు. ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జి అయిన తన బాబాయ్‌ను మడుపల్లిలో దింపి బుధవారం రాత్రి ఇంటికి వస్తుండగా, నిద్రమత్తు కారణంగా రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి కారు దూసుకెళ్లింది. దీంతో రమేష్‌కు తీవ్రగాయాలు కాగా ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా, రమేష్‌కు వివాహమై 12ఏళ్లు కాగా రెండు నెలల క్రితం కుమారుడు జన్మించగా.. ఇప్పుడు ఆయన మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ఘటనపై ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు...

కామేపల్లి: అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని గోవింద్రాలకు చెందిన ఆంగోత్ రాములు(70) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించినా నయం కాకపోవడంతో బుధవారం ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం రాములు పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఏఎస్ఐ మృతి



భరోత్ పూసి (ఫైల్)

కల్లూరు: కల్లూరు పంచాయతీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఏఎస్ఐ భరోత్ పూసి(68) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆయన గురువారం ఉదయం ఖాన్‌ఖాన్‌పేట ప్రధాన రహదారి మీదుగా బొడ్రాయి వైపు ఉన్న తన ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి అదే గ్రామానికి చెందిన మారబోయిన కృష్ణ ప్రసాద్‌ను ఢీకొట్టింది. ఆపై ద్విచక్ర వాహనంతో పక్కన ఆగిన భరోత్‌ను సైతం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనకు కల్లూరు, ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలిస్తుండగా రాత్రి మృతి చెందాడు. కాగా, భరోత్‌కు భార్య రామరాజ్యంతో పాటు, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సత్తుపల్లి పోలీస్ బెటాలియన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఆయన మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెనుబల్లి: మండలంలోని మర్లకుంట శివారులో గురువారం కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై కె.వెంకటేష్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నలుగురు పట్టుబడగా ఇంకొందరు పరారయ్యారు. పోలీసులకు చిక్కిన వారి నుంచి రూ.23 వేలు నగదు, నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బస్సు, ఆటో ఢీ, ముగ్గురికి గాయాలు

వైరారూరల్: మండలంలోని సోమవరం శివారులో గురువారం ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని జగ్గయ్యపేట డిపోకు చెందిన బస్సు వైరా నుండి జగ్గయ్యపేటకు వెళ్తోంది. ఈక్రమాన గొల్లపూడి నుండి వైరా వస్తున్న ఆటో లారీని ఓవర్‌టేక్ చేసే క్రమాన ఎదురుగా వచ్చిన బస్సును ఢీకొని రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న రూప, ఆటో డ్రైవర్ షేక్ కరీం, మరో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. అయితే, తృటిలో పెనుప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 ఈఎంటీ మాలపోగు రామకృష్ణ, పైలట్ చిత్తారు గోపాలకృష్ణ క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఏ. వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



వైరా: వైరా బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి గుర్తుతెలియని(35) వ్యక్తి మృతి చెందాడు. మతిస్థిమితం లేని సదరు వ్యక్తి బస్టాండ్‌లో పడి ఉండగా కంట్రోలర్ తేజావత్ నాగేశ్వరరావు ఇచ్చిన సమాచారంతో 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు హిందీ మాట్లాడేవాడని స్థానికుల ద్వారా తెలిసింది. ఈమేరకు మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ ఏవీకే.భాగ్యరాజ్ తెలిపారు.